# జాలి

ఒక టౌన్‌లో
రైల్వే స్టేషన్‌లో
మండు ఎండలో

ఇటువైపు ప్లాట్‌ఫారం నుంచి అటువైపు ప్లాట్‌ఫారం మీదకు వెళ్లడానికి కట్టిన ఓవర్ బ్రిడ్జి మీద అటూ ఇటూ దీనంగా దైన్యంగా ఆకలి చూపులు చూస్తూ కూర్చున్నారు భిక్షగాళ్లు ఆడా - మగా.

వాళ్లు
కాల్చి పారేసిన సిగరెట్ పీకల్లా వున్నారు.

వాడిపోయిన పువ్వుల్లా వున్నారు.
రెక్కలు విరిగిన పక్షుల్లా వున్నారు.
వాళ్ల ముందు సిల్వర్ గిన్నెలు ఉమ్ము వేసే తొట్లెల్లా వున్నాయి. ఆ గిన్నెల్లో విడిపైసలు గజ్జి కురుపుల్లా వున్నాయి.

కింద రైళ్లు ఆగుతున్నాయి, వెళ్తున్నాయి. మనుషులు దిగుతున్నారు, ఎక్కుతున్నారు. అటు వైపునుంచి

యిటూ, ఇటు వైపు నుంచి అటూ హడావిడిగా నడుస్తున్నారు.

బిచ్చగాళ్లకేసి చూస్తున్నారు. విడి పైసలుంటే వేస్తున్నారు — స్వర్గంలో తమకు స్థానం కేటాయించి వుందనుకుంటున్నారు. కొందరు చిల్లర లేదంటూ సానుభూతి చూపిస్తున్నారు. ఒక ఆసామీ పది పైసలు బిళ్ల ఒకడికిచ్చి, మీరందరూ పంచుకోండని నలుగురికీ వినిపించేలా చెబుతున్నాడు గొప్పగా.

ఎల్లమ్మ తన గిన్నెవంక పాలుకోసం తల్లి రొమ్మును చూసే పసి పాపలా చూసింది. రెండు రెండు పైసల బిళ్లలూ, ఓ మూడు పైసల బిళ్లా వున్నాయి. ఎల్లమ్మ ముందు నుంచి కాళ్లు కదులుతున్నాయి. చేతులు వూగుతున్నాయి. పైసలు మాత్రం రాలడం లేదు.

పైసలు గిన్నెలో పడినప్పుడు వాళ్ల కళ్లు మెరుస్తున్నాయి. కృతజ్ఞతగా చూస్తున్నాయి. గంటలు గబగబా గడుస్తున్నాయి.

బిచ్చగాళ్లు బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్నారు. కడుపులు తడుముకుంటున్నారు. ఆలా చాలాసేపు ఓపిగ్గా చూసి, ఒక్కొక్కరూ లేచి, రైల్వే స్టేషన్ దాటేరు. నెమ్మదిగా వెంకటేశ్వరుడి కోవెల చేరుకున్నారు. కోవెల వెనక్కిపోయి కూర్చున్నారు. తమ దగ్గరున్న పైసల్ని లెక్కపెట్టుకున్నారు. ఎంత తిండి దొరుకుతుందో అంచనా వేసుకుంటూ ఆలోచనలో పడ్డారు.

వాళ్ల ఆలోచనల్లో కార్లు లేవు. బార్లు లేవు. మోసాల్లేవు. మాయల్లేవు.

వెంకటేశ్వరుడి గుడిలో రంగు రంగుల దీపాలు ఆకాశంలో వేలాడుతూ మిలమిలా మెరుస్తున్న నక్షత్రాల్లా వున్నాయి. గంట క్షయ రోగి దగ్గులా వినిపిస్తోంది.

భక్తులు బయట జోళ్లు విడిచి, దేవుడి ముందు కళ్లు మూసుకుని "తమ జోళ్లను ఎవరూ ఎత్తుకుపోరుగదా" అన్న ఆలోచన వచ్చి సందుకు నాలుక్కరచుకుని లెంపలు వేసుకుంటున్నారు. అరటి పళ్లు కొందరూ, కొబ్బరి కాయలు కొందరూ దక్షిణతో సహా పూజారి తెచ్చిన పళ్లెంలో పెడుతున్నారు అందులో మూడోవంతు ప్రసాదంగా తీసుకుంటున్నారు. కళ్ళ కద్దుకుని నోట్లో వేసుకుంటున్నారు.

అప్పుడు భక్తులు లంచం యిచ్చి తమకు కావల్సినవి "శాంక్షన్" చేయించుకునే కంట్రాక్టర్లలా వున్నారు. వాళ్ల ముందు దేవుడు వాగ్దానం చేసి నిలబెట్టుకోలేని అసలుసిసలు రాజకీయ నాయకుడిలా వున్నాడు.

ఒక భక్తుడు తన పాత చెప్పు లొదలి సంతోషంగా కొత్తవి తొడుక్కుని పోతే, మరొకడు తన జోళ్ళు పోయాయని ఏడుస్తున్నాడు. విచారంగా రాత్రి పెరిగేకొద్దీ భక్తుల సంఖ్య తరిగిపోయింది.

పూజారి అరటి పళ్ళ వంకా, కొబ్బరి ముక్కల వంకా, పళ్లెం లోని చిల్లర వంకా తృప్తిగా చూశాడు, ముందు తలుపులు మూశాడు, వెనుక తలుపులు తెరిచాడు. లోపలి వెలుగు కొద్దిగా బయటకు వచ్చింది.

ఎల్లమ్మ పన్నెండు పైసలు పూజారి చేతులలో పడేసింది. పూజారి ఆరు అరటిపళ్లిచ్చాడు, మిగతా వాళ్లంతా తమ దగ్గరున్న పైస లిచ్చి పూజారి దగ్గర అరటిపళ్ళు కొనుక్కున్నారు. ఆవురావురుమంటూ అరటిపళ్లు తినేసి, మంచినీళ్ల కోసం పరుగెత్తారు.

తర్వాత, నెమ్మదిగా, మామూలుగా, నీరసంగా సంతపేటలోకి నడిచి, రేకు షెడ్డులోకి దూరేరు. గోడకు జేరబడి ఒకరూ, పడుకుని ఒకరూ కళ్ళు మూసుకున్నారు.

చీకటి చిక్కగా వుంది.

గాలి స్తంభించి పోయింది.

ఎల్లమ్మ చీకట్లోకి చూస్తూ వాళ్లందరికీ దూరంగా కూర్చుంది. ఆమె పక్కకు శీనయ్య వచ్చాడు. "ఎల్లమ్మా" అన్నాడు. "నేనే శీనయ్యనే" అన్నాడు. 'సచ్చిపోతున్నానే కొంచెం కనికరించవే. నీకు పున్నెం వుంటాది' అన్నాడు ఎల్లమ్మ మాట్లాడకుండా వూరుకుంది. శీనయ్య ఆమెను దగ్గరకు లాక్కున్నాడు, ఎల్లమ్మ కాళ్ళు మడచుకుంది.

♦ ♦ ♦

రెండ్రోజుల ఆకలిని కడుపులో వుంచుకుని, రెండేళ్ల కొడుకును ఒళ్లో పెట్టుకుని కూర్చుంది ఎల్లమ్మ. దీనంగా ధర్మం చెయ్యమని అడుగుతోంది. హీనంగా బతిమాలుతోంది.

కుర్రోడు ఏడుస్తున్నాడు. ఎండిన రొమ్ముల్ని నోట్లో పెట్టుకుని తన లాలాజలాన్నే మింగుతున్నాడు. ఎల్లమ్మ కొడుకును బాధగా చూసింది. నీరసంగా మూలిగింది.

ఎప్పటిలాగే ఎల్లమ్మ మళ్ళీ ఏడ్చింది— కుర్రోడ్ని కన్నందుకు. శీనయ్యపై దయతల్చినందుకు, వాడికి లొంగినందుకు, ఎవరూ తనకు పనివ్వనందుకు, ఎక్కడా పని దొరకనందుకు అడుక్కుతింటున్నందుకు.

పట్టు చీరలూ, సాదా చీరలూ, జరీ కండువాలు, గ్లాస్కో పంచెలూ ఖద్దరు చొక్కాలూ, నేరోకట్ పేంట్లూ గుడిలోకి ఎల్లమ్మ ముందు నుంచి వెలుతున్నాయి. ముఖాలకు బొట్లు పెట్టుకుని వస్తున్నాయి. చెవుల్లో పువ్వులు పెట్టుకుని వస్తున్నాయి.

గిన్నెలో నాలుగే పైసలున్నాయి. ఎల్లమ్మకేమీ పాలుపోవడం

లేదు కుర్రోడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. కడుపు కటకటలాడుతోంది. కొన్ని నెలలుగా పూజారి బిచ్చగాళ్లకు అరటిపళ్ళు అమ్మడం మానేశాడు. ఎక్కువ డబ్బు వస్తోందని కాంట్రాక్టుకు ఎవడికో ఇచ్చేస్తున్నాడు. ఎల్లమ్మ గుండెలు మండిపోతున్నాయి.

ఎల్లమ్మ ఆలోచిస్తూ చిరాగ్గా కూర్చుంది. పిల్లోడ్ని సముదాయించింది, వాడు ఏడుపు ఆపలేదు. ఎదురుగా వున్న మిఠాయి కొట్టు వంక చూస్తూ ఇంకా గట్టిగా ఏడ్చాడు. ఎల్లమ్మ విసుగ్గా చూస్తూ కూర్చుంది. ఇంతలో మిఠాయి కొట్లోనుంచి ఓ కాకి మిఠాయి వుండ తన్నుకు పోయింది. షావుకారు దాన్ని తిట్టుకుంటున్నాడు. చేసేదేమీలేక.

ఎల్లమ్మ ఆలోచన తెగింది. పెదవులపై చిరునవ్వు మెరిసింది. మనసు ఉత్సాహంగా వెన్ను తట్టింది. కళ్లు కాంతిని పుంజుకున్నాయి. కాళ్లల్లోకి సత్తువ వచ్చింది. చేతుల్లో చురుకుదనం నిండింది.

ఎండ ఎర్రగా వుంది.

ఆకాశం నిర్మలంగా వుంది.

గాలి వేడిగా వుంది.

ఎల్లమ్మ లేచింది. కుర్రోడ్ని అక్కడే కూర్చోబెట్టింది. గుళ్లోకి నడిచింది.

పూజారి అరటిపళ్లూ, కొబ్బరి ముక్కలూ సంచిలో వేస్తున్నాడు. పళ్లెంలో చిల్లర గుట్టలా వుంది ఎల్లమ్మ గుప్పెడు చిల్లర తీసింది, రెండో చేతికందినన్ని అరటిపళ్లు పట్టుకుంది. పూజారి వెర్రిగా చూశాడు. ఎల్లమ్మ నవ్వుతూ, నిర్లక్ష్యంగా నిలబడింది.

"ఏయ్, బుద్ధుందా నీకు ? లోపలికి రావచ్చా నువ్వు ? అవన్నీ ఇక్కడ పెట్టు. ఆకలిగా వున్నట్టుంది. ఈ రెండు పళ్లూ పట్టుకెళ్లు."

" నీ బోడి జాలి నాకక్కర్లేదు "

" ఏవిటే కూస్తున్నావ్ ? అవిక్కడ పెట్టు. లేకపోతే తంతాను" పూజారి కళ్లెర్ర జేశాడు.

" నువ్వన్నేయంగా అమ్ముకుంటున్నావ్. మేమాకల్తో సత్తన్నాం. నువ్వు తంతే నేను తిరగబడి తంతాను "

" పాపం మూట కట్టుకుంటున్నావే ముండా. అందుకే అడుక్కు తింటున్నావ్ "

" నోర్ముయ్యిరా లంజాకొడ్కా. పాపం గురించి నాకు సెప్పకురా. అట్టాగయితే నువ్వూ అడుక్కుతినాల. అసలా దేవుడు ముండాకొడుకుంటే నిన్ను బతకనిత్తాడా " ఎల్లమ్మ సింహంలా గర్జించింది.

పూజారి నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు.

( సృజన మాసపత్రిక మే '72 )